క్లుప్తంగా

వినాయక చవితి శుభాకాంక్షలు

ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలంతా సుఖసంతోషాలతో పండుగను నిర్వహించుకోవాలని, పంటలు బాగా పండి ప్రజలు ఆనందంతో మెలగాలని ఆయన తెలియజేశారు.

20న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దుర్గి: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఈ నెల 20వ తేది ఉదయం 11గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సమతావాణి తెలిపారు. ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఎంపీపీ ఏసూరి సాయి శంకర్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా సైదా నియామకం



దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నడికుడికి చెందిన షేక్ సైదా నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదివారం సైదాకు నియామకపత్రం అందజేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి సైదా క్రియాశీలకంగా పనిచేశారని, సైదా సేవలు పార్టీ గుర్తించి మైనార్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిందని ఎమ్మెల్యే చెప్పారు.

స్వచ్ఛభారత్ కార్యక్రమం

మాచర్ల: రాష్ట్ర ప్రభుత్వ సూచనలలో భాగంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివేకానంద స్టూడెంట్ హోంలో ఆదివారం ఫౌండర్, చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు, నిర్వాహకులు వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటారు.

సీఎంపై అభిమానంతో పాదయాత్ర



దుర్గి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా 2024 ఎన్నికలలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించాలని ఆకాంక్షిస్తూ మార్కాపురంకు చెందిన షేక్ సయ్యద్ జిలాని బాషా అనే అభిమాని చేపట్టిన పాదయాత్ర మాచర్ల నియోజకవర్గంలోని దుర్గి మండలంలోకి ప్రవేశించింది. ఆదివారం మాచర్ల పట్టణానికి చేరుకొని 2వేల కి.మీల పాదయాత్ర పూర్తయిన సందర్భంగా పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలను కలిసి తన పాదయాత్ర ఉద్దేశాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్‌పై అభిమానంతో సంక్షేమ పథకాలపై ప్రచారం చేపట్టడం అభినందనీయమన్నారు.

ఉచిత రక్తనాళాల పరీక్ష



మాచర్ల: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ పల్నాడు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని నారాయణ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత రక్తనాళాల పరీక్ష శిబిరంలో మాట్లాడుతూ ప్రతి ఒక్కరి శరీరంలో రక్తం ఎంతో ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. రక్తనాళాలు మూసుకుపోతే రక్త ప్రసరణ సరిగా జరగక ఇబ్బంది పడతారన్నారు. రక్తనాళాలు ఆరోగ్యంగా ఉంచుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విడేల శ్రీనివాసరావు, డాక్టర్ సుస్మిత, చుండూరు వెంకటేశ్వర్లు, షేక్ సికిందర్, విడేల అంక ప్రకాశరావు, ఓరుగంటి చెన్నకేశవరావు, ప్రిన్సిపాల్ ఉల్లారెడ్డి, చుండూరు సత్యనారాయణ తదితరులున్నారు.

కోడి పందేలపై దాడులు

చిలకలూరిపేట టౌన్: పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం శివారులో కోడి పందేలపై అర్బన్ పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. పట్టణ ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాలు.. దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి నాలుగు పందెపు కోళ్లు, రూ.12,520 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

బొప్పూడిలో..

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడిలో పేకాట స్థావరాలపై రూరల్ ఎస్ఐ ఎస్.రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. పేకాటాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని రూ.3,500 స్వాధీనం చేసుకున్నారు.

పూజకు వేళాయె..

వినాయక చవితికి సర్వం సిద్ధం

గురజాల : గణపతి నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో సుమారు 50కి పైగా వినాయకచవితి పందిళ్లను ఏర్పాటు చేశారు.ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి గణనాథులను కొలువుదీర్చారు. విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు . ప్రత్యేక వాహనాల్లో వినాయక విగ్రహాలను మండపాలకు కమిటీ నిర్వాహకులు చేరుస్తున్నారు. జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై అంటు నినాదాలతో మండపాలకు తరలిస్తున్నారు.



వినాయక విగ్రహాల అంగడి వద్ద సందడి

పండుగ సందడి ..

కారెంపూడి: వినాయక చవితి పండుగ సందర్భంగా ఆదివారం ఎక్కడ చూసినా మండలంలో వేడుకల ఏర్పాట్ల సందడి నెలకొంది. గ్రామాలలో వినాయక మండపాలు సిద్ధం చేస్తున్నారు. అలాగే పూల దండలు, లడ్డూలు, ఇతర పూజ సామగ్రి కొనుగోలుతో వినాయక చవితి సందడి కన్పిస్తోంది. పూల అంగళ్లు, స్వీట్స్ షాపులు కొనుగోలుదారులతో పండుగ హడావుడి నెలకొంది. గ్రామాల ప్రధాన కూడళ్లలో మండపాలను అందంగా వివిధ రకాల లైటింగ్‌లతో సిద్ధం చేస్తున్నారు. అలాగే మరో వైపు వినాయక ప్రతిమలను ట్రాక్టర్లు ఇతర వాహనాలలో గ్రామాలకు తరలిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు వివిధ ప్రాంతాల నుంచి పండుగకు స్వస్థలాలకు తరలిరావడంతో గ్రామాలలో సందడి కనిపిస్తోంది. దీంతో ప్రజలు సంతోషంతో పండుగ జరుపుకోడానికి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

మట్టిగణపతే శ్రేష్టం ...

పిడుగురాళ్ల: గణనాథుడు పూజకు సిద్ధమవుతున్నాడు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి నిర్వహించుకునే తెలుగు పండుగలలో వినాయక చవితి ఒకటి. అలాంటి పండుగ పట్టణంలో ఏ వీధి చూసినా, చిన్న గ్రామాలలో సైతం పదుల సంఖ్యలో గణనాథులను ఏర్పాటుచేసి పూజలు నిర్వహించేందుకు అంతా సిద్ధం చేస్తున్నారు. పట్టణ శివారులోని స్కాలర్ స్కూల్ ఎదురు, కొండమోడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరారు. పర్యావరణ వేత్తలు పర్యావరణాన్ని కాపాడుదామని పట్టణంలో పలు చోట్ల మట్టి వినాయకులను ఏర్పాటు చేసి ఉచితంగా పంపిణీ చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొనివస్తున్నారు.



ప్రతిమలను ట్రాక్టర్ ట్రక్కులోకి ఎక్కిస్తున్న భక్తులు

అనుమతులు తప్పనిసరి : సీఐ ఆంజనేయులు

వినాయక చవితి విగ్రహాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్‌లో పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. అంతేకాకుండా ఆ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పార్టీ నాయకుల గుర్తులు కానీ, పార్టీలకు సంబంధించి ఎలాంటి గొడవలు జరిగిన సహించేది లేదని తెలియజేశారు.

ఎటుచూసినా విగ్రహాల ఏర్పాటు

మాచర్ల: పట్టణంలోని వివిధ ప్రాంతాలలో సోమవారం ఘనంగా వినాయకచవితి పండుగను జరుపుకునేందుకు వీధివీధుల్లో పందిళ్ళు వేసి వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి సంబరాలకు రంగం సిద్ధం చేశారు. నెహ్రూనగర్‌లోని ప్రధాన వీధిలో భారీ స్థాయిలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అన్నీ సెంటర్‌లలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి లైట్లతో పందిళ్లను తీర్చిదిద్దారు. పోలీసు, విద్యుత్ శాఖ అనుమతులు తీసుకొని నిర్వాహకులు వినాయక చవితి పండుగ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మూడు జిల్లాల వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు ఆయా వార్డులలో పూజలు నిర్వహించనున్నారు.



వేదికపై సిద్ధం చేసిన గణనాథుడు

వినాయక చవితి శుభాకాంక్షలు

పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, విప్ పీఆర్కే

మాచర్ల: పల్నాటి ప్రజలు వినాయక చవితి పండుగను ఘనంగా జరుపుకోవాలని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి విఘ్నాలు జరగకుండా ఉండాలని కోరుకుంటూ వినాయకుని ఆశీస్సులు కోరుతూ ప్రతి ఒక్కరూ పూజలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో వినాయక చవితి పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

పేద ప్రజల అభ్యున్నతికే సంక్షేమ పథకాలు

రెంటచింతల: రాష్ట్రంలోని పేద ప్రజల అభ్యున్నతి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తూ వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 42వ సచివాలయంలో 174 వ రోజు గ్రామంలోని నాయుడుపేట, ఆంతోనివారి కాలనీలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పీఆర్కేకు ప్రతి గడప నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాల ద్వారా ఎంత ప్రయోజనం చేకూరిందో ప్రతి గడపకు వెళ్లి వివరించారు. కాలనీలో ఒక్కొక్క కుటుంబానికి ఏఏ పథకం ద్వారా ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరిస్తూ మీ చల్లని ఆశీస్సులు, దీవెనలు సీఎం జగన్‌కు అందించాలని కోరారు. కరోనా కారణంగా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ప్రజలకు మంచి పరిపాలన అందించిన ఘనత దేశంలో సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కాలనీలో ఇలా ప్రతి కుటుంబం రూ.60 వేల నుంచి రూ.4.50 లక్షల వరకు లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. సీఎం జగన్ తాను చేసిన సుదీర్ఘ పాదయాత్ర సమయంలో, 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా చెప్పని పథకాలను కూడా అమలు చేశారన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలలో అవినీతికి తావులేకుండా సుపరిపాలన చేస్తున్నా ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు అబద్ధాలు చెప్పడం వారి నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. 2024 ఎన్నికలలో కూడా మళ్ళీ జగన్‌కే మద్దతుగా నిలవాలన్నారు. ముందుగా జండా చెట్టు సెంటర్లోని ఫాతిమా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సీఎం చంద్రబాబు తన పాలనలో ఏనాడు ప్రజల కోసం పనిచేయలేదని తన కుటుంబ ప్రయోజనాలకోసమే పని చేశారని విమర్శించారు. ముందుగా పీఆర్కేకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూజల పుష్పావతి రామయ్య, ఉప సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జెడ్పీ వైస్ చైర్మన్ కొంతిరెడ్డి నర్సిరెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమ, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, వైస్ ఎంపీపీ ఏరువ శౌరైడ్డి, పీఆర్‌డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్ రెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ ఆదూరి ఇన్నారెడ్డి, పార్టీ నేతలు, ఏఈలు, కార్యదర్శి, పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



రెంటచింతలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే

ఘనంగా విశ్వకర్మ జయంతి

- విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం జగన్ ప్రత్యేక చర్యలు
- రాష్ట్ర పండుగగా గుర్తింపు
- ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి వారి కమ్యూనిటీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని ప్రకటించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని స్వర్ణకారుల బజారులో నిర్వహించిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో పాల్గొని పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి విశ్వబ్రాహ్మణులను గుర్తించారన్నారు. నియోజకవర్గంలోనూ విశ్వబ్రాహ్మణులు నిర్వహించుకునే విశ్వకర్మ జయంతికి పురపాలక సంఘం తరపున ప్రతి సంవత్సరం నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. అదే విధంగా పట్టణంలోని విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించి వివిధ అభివృద్ధి పనులకు వారి సూచనలు తీసుకుంటామన్నారు. ముందుగా విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతి సందర్భంగా జెండాను ఆవిష్కరించి భారీ స్థాయిలో పూజలు నిర్వహించారు. అనంతరం హోమాన్ని జరిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. జయంతి కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు కటకం వెంకటాచారి, అధ్యక్షులు కటకం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి మోహన్ రావు, సంఘ పెద్దలు జ్యూయలర్స్ బాబు, కూరెళ్ళ వీరబ్రహ్మచారి, శ్యాంసుందరాచారి తదితర కమిటీ, సంఘ పెద్దలు పాల్గొన్నారు. సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు.

గురజాలలో...

గురజాల : స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ప్రత్యేక వాహనంపై విశ్వకర్మ చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు దర్శించుకున్నారు.



విశ్వకర్మ జయంతి సందర్భంగా హోమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే

నాగార్జున శిల్ప కళా కేంద్రంలో..

దుర్గి: స్థానిక నాగార్జున శిల్ప కళాకేంద్రంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధినేత చెన్నుపాటి సీతారామయ్య మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం భగవాన్ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నుపాటి సాయి పలువురు కళాకారులు ఉన్నారు.

మాచవరం మండల పరిషత్ కార్యాలయంలో..

మాచవరం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ పెద్దలను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య, సర్పంచుల సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లాభక్షు, సర్పంచ్ కొండలు, ఏవో ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాచర్ల తహసీల్దార్ కార్యాలయంలో..

మాచర్ల రూరల్: భగవాన్ శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవటం శుభపరిణామమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల ఆరాధ్యదేవుడైన విశ్వకర్మ జయంతిని దేశ చరిత్రలోనే రాష్ట్ర పండుగగా జరుపుకునేలా ఆదేశాలందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనందరం కృతజ్ఞతలు తెలుపుతూ అండగా ఉందామన్నారు.



విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మరుమాముల శ్రీనివాసశర్మ, జూలకంటి వీరారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు కటకం నాగేశ్వరరావు, కటకం వెంకటాచారి, తాళ్ళూరి మోహన్‌రావు, బాబు, శివాచారితదితరులున్నారు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ..

రెంటచింతల: స్థానిక శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్ జయంతి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుల నేతృత్వంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరిపించి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ముందుగా పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షులు కత్తెరపల్లి భిక్షాచారి మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రత్యేక జీవో తీసుకువచ్చిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలలో మోడేపల్లి వెంకటేశ్వరాచారి, చెన్నుపాటి నరసింహాచారి, వి.వెంకటాచారి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ

మాచర్ల: పట్టణంలోని బస్టాండ్ సెంటర్‌లో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 1000 మందికి మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. అంతకు ముందు ఆలయ కమిటీకి చెందిన వీరాంజనేయరెడ్డి, చుండూరు మల్లిఖార్జునరావు, చెన్నకేశవరావు, ఓవీఆర్, ఎంఆర్‌ఎఫ్ రామాంజనేయరెడ్డి, గట్ల కోటిరెడ్డిల ఆధ్వర్యంలో దేవాలయంలో ప్రభుత్వ విప్ పీఆర్కే పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పీఆర్కేకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో..

గురజాల : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని విశ్వహిందూ పరిషత్ పల్నాడు జిల్లా మహిళా సభ్యురాలు జొన్నలగడ్డ రాజేశ్వరి సూచించారు. స్థానిక పాటపాటేశ్వరమ్మ దేవాలయం వద్ద ఆదివారం సాయంత్రం వినాయకచవితి పండుగను పురస్కరించుకుని స్మైల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 1300 మట్టి వినాయక ప్రతిమలను అందించారు.త్రిపురమల్లు విజయలక్ష్మీ, ఫౌండేషన్ అధ్యక్షుడు జి.కాశీవిశ్వనాథం, రవికుమార్, ఏడుకొండలు, హనుమంతరావు, మహేష్‌బాబు, అమృతలింగేశ్వరరావు తదితరులున్నారు.

రెండువేల ప్రతిమలు పంపిణీ..

రెంటచింతల: మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలే పండుగలని పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు తయారు చేయించిన 2 వేల మట్టివినాయకుని ప్రతిమలను ఆయన ఆదివారం డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు మద్దిరాల కృష్ణారెడ్డి నేతృత్వంలో పంపిణీ చేసి మాట్లాడారు. మట్టి వినాయకుని ప్రతిమలను 6 సంవత్సరాలుగా ఉచితంగా అందిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి ముందుకు వచ్చి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ పల్నాడు జిల్లా కో ఆర్డినేటర్ మోర్తల ఉమా, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఫౌండేషన్ అధ్యక్షులు పేరం చెన్నారెడ్డి, దుర్గి మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, పమ్మి సీతారామిరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయకుని ప్రతిమలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

పిడుగురాళ్ల: మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని చింతలపూడి ట్రస్ట్ సభ్యులు, పల్నాడు హాస్పిటల్ అధినేత చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. పట్టణంలో పల్నాడు హాస్పిటల్ వద్ద ఆదివారం వెయ్యి మట్టి వినాయకులను పంపిణీ చేసి మాట్లాడుతూ ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

చవితి పందిళ్ళకు పోలీసుల అనుమతి తప్పనిసరి

రూరల్ సీఐ షేక్ షమీముల్లా



మాచర్ల రూరల్: వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని రూరల్ సీఐ షేక్ షమీముల్లా కోరారు. ఆదివారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వినాయక చవితి పందిళ్ళు, మండపాలు ఏర్పాటు చేసుకోవటానికి పోలీసుల అనుమతికి కమిటీ సభ్యుల పేర్లు ఇచ్చి అనుమతులు పొందాలని, భద్రతకు రాత్రి వేళలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే కమిటీ వారిదే పూర్తి బాధ్యత అని తెలిపారు. నిమజ్జన సమయంలో రంగులు చల్లుకోవటం, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయటం, టపాకాయలు కాల్చటం చేయరాదన్నారు. అసభ్యకర నాట్య ప్రదర్శనలు, మద్యం, మత్తు పదార్థాలు సేవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధానం ప్రకారం అనుమతులు తీసుకొని వినాయక నిమజ్జనం పోలీసులు సూచించిన ప్రాంతంలోనే చేయాలన్నారు. ఇప్పటికే నిమజ్జన ప్రాంతాలైన నాగార్జున సాగర్ కొత్తబ్రిడ్జి, సత్రశాల టైల్‌ప్లాంట్, ఇతర ప్రాంతాలను పరిశీలించి తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. భక్తిశ్రద్ధలతో ఐక్యంగా పండుగను జరుపుకొని గణేశుని ఆశీస్సులు పొందాలని కోరారు.

సత్రశాలలో బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి

సత్రశాల(రెంటచింతల): భక్తులు అత్యంత నియమనిష్టలతో పరమశివుడిని ఆరాధించి దాన ధర్మాలు చేస్తే శివ కేశవుల అనుగ్రహం లభిస్తుందని బనగానపల్లి బ్రహ్మంగారి మఠం పీఠాధిపతి 8వ తరం వారసుడు వెంకటాద్రి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని సత్రశాలలో పురాతన శైవక్షేత్రమైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామిని దర్శించి ప్రధాన అర్చకులు చిట్టేలా శివశర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరమశివుని ఆశీస్సులు పొందడానికి శ్రావణ, కార్తీక మాసాలలో ఆ మహదేవుడిని పూజించాలన్నారు. సత్రశాల మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసిన ట్రస్ట్‌బోర్డు సభ్యులను అభినందించారు. ఆయనను చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి, ఈఓ గాదె రామిరెడ్డి, జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టం భాస్కర్‌రెడ్డి, మద్దిగపు వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మండలంలోని తుమృకోట గ్రామంలో నిర్వహిస్తున్న విశ్వకర్మ జయంతి వేడుకలలో పాల్గొన్నారు.